# కటకటాల్లో కణజీవి

"అరేయ్ఁ... చెలపాయ్! వెలగబెట్టిన చదువులు చాలు గాని, ఉద్యోగం పేరుతో నువ్వు మన ఊరు వదిలి వెళ్లడానికి మాత్రం వీలులేదు. తాతగారు బోల్డు సంపాదించారు. నువ్వు కాలుమీద కాలు వేసుకుని కూర్చుని పదికాలాల పాటు తిన్నా తరిగిపోని సంపద!"

– అని అంటూ 'చెలపాయ్' అనబడే చలపతి బామ్మ– యం.యస్.సి. కంప్యూటర్స్ అయ్యాక విదేశాలకు వెళ్లి, పెద్ద ఉద్యోగం చేసి లక్షలు సంపాదించాలనీ, తన తాతగారి ఆస్తి కరిగిపోకుండా తన కాళ్లమీద తాను నిలబడాలనీ... అతను కన్న కలల్ని మధ్యలోనే 'కట్' చేసేసింది.

చలపతి ఐదడుగుల పదంగుళాల పొడుగు వుంటాడు. చామనఛాయగా, దృఢంగా బామ్మ పెంపకంలో తయారయ్యాడు. ఈమధ్యనే మీసాలు, గెడ్డాలూ పెంచి, క్రాపు చేయించు కోకుండా జులపాల జుట్టు పెంచాడు. బామ్మ "జుట్టు అయినా తగ్గించుకోరా బాబూ!" అని పోరింది. మనవాడు వింటేనా..?

ఈ పరిణామ క్రమంలో– 'ఇంట్లోనే ఉండి లక్షలు, కోట్లు ఎలా సంపాదించాలా..?' అనే ఆలోచన చేశాడు.

చలపతి పర్సనల్ రూమ్‌లో గుఱ్ఱపునాడా ఆకారంలో ఒక బల్ల, ఒక వీల్‌ఛైర్, ఎదురుగా కంప్యూటర్, ప్రక్కనే ప్రింటర్, వీటన్నింటికీ కనెక్షన్ వున్న రకరకాల సెల్‌ఫోన్స్ సెట్స్!

చలపతి వీల్‌ఛైర్‌లో కూర్చుని తన చెవుల్లో సెల్స్‌కి కనెక్షన్ ఉన్న ఇయర్ ఫోన్స్ పెట్టుకుని, నోటిముందు బుల్లి మౌత్‌పీస్‌లో అతను మాట్లాడుతుంటే... 'షార్ కేంద్రంలో రాకెట్ లాంచింగ్ పర్యవేక్షిస్తున్న శాస్త్రవేత్త'లా వున్నాడు.

ఒకరోజు బామ్మ చెలపాయ్ గదిలో ప్రవేశించి, అక్కడి సీనంతా వీక్షించి– తన మనవడి తెలివితేటలకు అబ్బురపడిపోయి, ఆపై గాలి వూదిన బెలూన్‌లా అయిపోయి–

'ఏమిటో అనుకున్నాను గానిరా చెలపాయ్ఁ... నీకు అచ్చంగా మీ తాతగారి పోలికలే వచ్చాయిరా! ఆయనా ఇంతే... ఆ రోజుల్లో బ్రిటిష్ వాళ్ళని మీ తాతగారు తన తెలివితేటలతో బిక్కచచ్చిపోయేట్లు చేసేవారనుకో! అన్ని ముఖ్యమైన పనులకూ మీ తాతగార్నే పంపించేవాళ్ళట బ్రిటిషువాళ్ళు. సరిగ్గా అటువంటి తెలివితేటలే వచ్చాయిరా సన్నాసీ నీకు! ఉండు..." అని ఆమె లోపలకు వెళ్లి ఉప్పూ, ఎండు మిరపకాయాలూ తీసుకువచ్చి దిష్టితీసి పారేసింది. ఆ

తరువాత సదరు పదార్థాలు నిప్పుల్లో వేసిన ఫలితంగా ఇంటిల్లిపాదీ దగ్గుతూ సతమత మయ్యారనుకోండి. దగ్గుతెరలు తగ్గిన తరువాత బామ్మ వచ్చింది.

"అంతా బాగానే వుందిరా చెలపాయ్! వీటన్నింటితో ఏం చేస్తావురా? సినిమా చక్రాలు తయారుచేస్తావా?" అంది బామ్మ.

"సినిమా చక్రాలేమిటే... నా బొంద!" అన్నాడు.

"అవేరా... గుండ్రంగా మెరుస్తుంటాయి... మధ్యలో కన్నం వుంటుంది కదా!"

"చంపావు కదే... సీడీలా? అవి కాదు. కేబుల్‌లో మనకు చాలా కార్యక్రమాలు వస్తున్నాయి. వాటిల్లో లక్షలకొద్దీ ప్రైజులు వున్నాయి."

"నీ ముఖంలే! ఆ లక్షలన్నీ మనకెందుకు వస్తాయిరా?"

"చెబుతా విను... కూర్చో ముందు! 'బ్రెయిన్ ఆఫ్ తెలుగు' అనే కార్యక్రమంలో మనల్ని ఫోన్ ద్వారా పిలిస్తే ఇరవై లక్షలు, 'బంగారం దోచుకో!' అనే మరో కార్యక్రమంలో ఫోను చేస్తే మనల్ని పిలిస్తే కిలోల కిలోల బంగారం, 'సినీ మల్టీకాంప్లెక్స్' అనే మరో కార్యక్రమంలో మన ఫోను కలిసి, మనల్ని పిలిస్తే పదిలక్షల రూపాయలు, అంతేకాకుండా ప్రపంచంలో అందరితో ఇంటర్‌నెట్‌లో మాట్లాడుతూ మనం టచ్‌లో వుంటే... ఒక్కోసారి యూరో లాటరీలో వందల కోట్లు వస్తాయ్ బామ్మా!"

- అంటూ చెలపాయ్ చెబుతుంటే... బామ్మ వెంటనే లేచి, చెలపాయ్ ముఖాన్ని తన రెండుచేతులతో దగ్గరకు తీసుకుని మెటికలు విరుచుకుని-

"నా తండ్రే... ఎన్ని అఖండమైన తెలివితేటలురా నీకు?! తొందర్లోనే ప్రపంచంలోని కోటీశ్వరుల్లో నువ్వూ ఒకడివి అయిపోతావేమో... ఎవరికి తెలుసూ?" అంటుంది బామ్మ.

చలపతి ఒక్కసారిగా... బొంబాయిలో ఓబరాయ్ షెరటొన్ హోటల్‌లో ఎగ్జిక్యూటివ్ స్యూట్‌లో, ఫుల్ సూటింగ్స్‌లో, నోట్లో పైపుతో నిలబడివుంటే... అతనికి అటూ ఇటూ అందమైన అమ్మాయిలు 'సర్... కాటేజ్ అవర్ నెక్స్ట్ ప్రోగ్రాం!' అంటున్నట్లుగా ఊహించుకుని, ఆ సీన్‌లోకి వెళ్లిపోయాడు ఒక్క క్షణం.

'వెంకటాచలపతి' తన పేరును కాస్తా 'వి.పి. చెల్'గా మార్చుకున్నాడు. ఇంటర్‌నెట్ ఛాటింగ్‌లో మరీ చీప్‌గా వుంటుందనీ, ఇంటర్నేషనల్ లెవెల్‌లో 'వెంకటాచలపతి' అంటే అదేమిటో అర్థంకాక నవ్వుతారనీ అనిపించింది. అంటే... ఇప్పుడు 'వి.పి. చెల్' అలియాస్ వెంకటాచలపతి అన్నమాట!

"హలో... అయామ్ వి.పి. చెల్! హౌ ఆర్ యూ?"

"హాయ్ఁ... వి.పి.చెల్! కెన్ యూ సప్లై బాత్‌రూమ్ క్లీనర్స్?"

'ఛీ... ఇదేంటీ- రాంగ్ కనెక్షన్ వచ్చింది?! బాత్‌రూమ్ క్లీనర్స్‌ను తను సప్లయ్ చేయడమేమిటి?' అనుకున్నాడు చలపతి. ఇంటర్‌నెట్‌లో కనెక్షన్ దొరికాక ఒక్కోసారి ఇలాగ కూడా జరుగుతోంది అతనికి.

'బ్రైన్ ఆఫ్ తెలుగు' ప్రోగ్రాంకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా- వాళ్ళు వేసే పిచ్చిప్రశ్నలకు (అతని దృష్టిలో తను చెప్పలేనివి) జవాబు చెప్పలేకపోతున్నాడు. ఎప్పటికైనా జవాబులు చెప్పలేకపోతాడా?

'బంగారం దోచుకో!' కార్యక్రమానికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా- లైను కలవడం లేదు. తను కనుక వెళ్తే ప్రతీసారి కిలో బంగారం గెలవడం ఖాయం!

'సినీ మల్టీపెక్స్'లో తనను పిలుస్తారేమోనని రోజూ ఫోన్ చేయడం, సరిగ్గా తన నంబరుకి కనెక్షన్ కలిసే టైముకు కార్యక్రమం కాస్తా ముగిసిపోవడం జరుగుతోంది.

ఇంటర్‌నెట్‌లో 'ఛాటింగ్' చేయడం ఇప్పుడిప్పుడే వస్తోంది. మంచి విదేశీ అమ్మాయిని చూసుకున్నాడా... ఇక తనకు తిరుగులేదు.

ఇలాగ గాలిలో అపార్ట్‌మెంట్స్ కడుతున్నాడు చలపతి. భోజనం చేస్తున్నా, టిఫిన్ చేస్తున్నా, బాత్‌రూమ్‌కి వెళ్లినా, స్నానం చేస్తున్నా... చెవిలో ఇయర్ ఫోన్లు, నోటి ముందు బుల్లి మౌత్‌పీస్ వుండాల్సిందే!

ఈ తతంగంతా చూసిన పనమ్మాయి ఒకసారి "బామ్మగారూ! మీ మనవడిగార్కి చెవుడా? ఇనపడదా? డాక్టర్‌గార్కి చూపించండమ్మా!" అంది అమాయకంగా.

"చాల్లే నీ నోరు పడ! నా మనవడికి విదేశాల నుంచి ఫోనులు వస్తాయే! లక్షలు, కోట్లు సంపాదిస్తున్నాడే..?!" అంటూ పనమ్మాయిపై వొంటికాలి మీద లేచింది కోపంతో.

"తెలవకన్నానులేమ్మా... కోప్పడమాకండి!" అంది భయంతో బిక్కచచ్చిపోయి. కాని, ఎందుకో... దానికి ఆ కుర్రాడు 'పిచ్చాడి'లాగే కనుపించాడు.

ఇలాగ ఒక సంవత్సరం గడిచింది!

●

చలపతి సంపాదన సంగతి దేముడెరుగు...

కరెంటు బిల్లు, ఇంటర్‌నెట్ బిల్లు, టీవీ, ఫోన్ బిల్లు, సెల్‌ఫోన్ల కార్డులు... అన్నీ కలిపి తడిసి మోపెడు అయ్యింది.

"అరేయ్‌ు... చెలపాయ్! ఈ సంవత్సరంలో లక్షా ఏభైవేలు నీ వ్యాపారం మీద పెట్టుబడి అయ్యిందంటున్నావు. ఎంత ఆదాయం వచ్చిందేమిటి?" అంది బామ్మ.

వెంటనే చలపతి- బామ్మ ఈ కార్యక్రమం ఆపేయమంటుందేమోనని భయపడి, "బామ్మా! ఏ పనికైనా ముందు పెట్టుబడి పెట్టాలి. భయపడితే ఏ పనీ చేయలేము. నాకు ఒక్కసారే కోట్లు తగులుతాయి చూడు... ఏదో ఒక ఫోన్ తగలకపోదు!" అన్నాడు.

"అవునులే నాన్నా! నీ కోరిక తప్పక తీరాలని నేను మొక్కని దేముళ్ళు లేరనుకో! తిరుమల వెంకన్న, శ్రీశైలం మల్లికార్జునుడు, సింహాచెలం అప్పన్న, అన్నవరం సత్యనారాయణ స్వామి, యాదగిరి లక్ష్మీనరసింహస్వామి... ఇంకా ఎంతోమంది దేవతలు నీ కోరిక తీర్చాలిరా!" అంది బామ్మ.

ఇంతలో...

వీధి తలుపులు దబదబా బాదసాగారు ఎవరో! తలుపులు బ్రద్దలైపోతాయేమోనన్నంత గట్టిగా బాదుతున్నారు.

ఉరుకుల పరుగులతో వెళ్లి బామ్మ తలుపులు తీసింది.

అంతే...

తలుపులు తోసుకుంటూ, ఆమెను నెట్టుకుంటూ ఒక ఇరవైమంది పోలీసులు, అధికారులు కనపడిన వస్తువు మీదల్లా లాఠీలతో కొడుతూ లోపలకు ప్రవేశించారు- కాదు, కాదు... దూసుకొచ్చారు.

"బామ్మగారూ! మీ ఇంట్లో ఎవరైనా ఇంటర్‌నెట్‌లో మాట్లాడుతున్నారా?" అంటూ ఒకాయన చలపతి గదిలోకి ప్రవేశించాడు.

ఆయన వెనుకనే మిగతా వాళ్ళందరూ గబగబా ఆ గదిలోకి చేరారు.

సరిగ్గా...

అప్పుడే పాపం... చలపతికి శ్రీలంక్ కాల్ కలిసింది ఛాటింగ్‌లో!

అదే అతని పాలిట శాపమైంది!!

"హలో... శ్రీలంకలో అరుణాతుంగ మాట్లాడుతున్నారా? నా పేరు వి.పి. చెల్..."

అతని మాటలు పూర్తికాలేదు... ఒక్కసారిగా పోలీసులంతా అతన్ని సమీపించి-

"మిస్టర్... యూ ఆర్ అండర్ అరెస్ట్! మీరు శ్రీలంకలోని యల్.టి.టి.ఈ.తో సంబంధం కలిగివున్నారు. వారికి ఏజెంటుగా పనిచేస్తున్నారు..." అని చలపతిని పదిమంది పోలీసులు కదలకుండా పట్టుకొని- బయటకు దాదాపు మోసుకుని వెళ్ళి, ఆ తర్వాత లాక్కునిపోయి, పోలీస్ వ్యాన్‌లో కుదేశారు... బియ్యం బస్తా లాగ.

తరవాత-

చలపతి గదిలో సామానంత వ్యాన్‌లో చేర్పించి, వెళ్ళిపోయారు- బామ్మ కేకలు విన్పించుకోకుండా, ఆమె ఏడుపులు పట్టించుకోకుండా.

పోలీస్‌స్టేషన్‌లో ఇనపగొలుసులతో బంధించారు చలపతిని. మెడలో ఒక పెద్ద ఇనుప రింగ్! ఆ రింగ్‌ని కలుపుతూ కాళ్ళకు, చేతులకు కొన్ని గొలుసులు తగిలించారు. కడుపు మీద మరో రింగు! ఆ రింగు నుంచి కాళ్ళకు మరో రెండు గొలుసులు తగిలించారు. వెరశి అతని ఒంటిమీద డ్రాయర్ మాత్రమే మిగిల్చారు.

పోలీస్‌స్టేషన్‌కి తీసుకువచ్చినప్పటి నుండీ- "యల్.టి.టి.ఈ. వాళ్ళు నీకు ఎవరు తెలుసు? అతని అడ్రసు ఏమిటి?" అని ఒకడు కుళ్ళబొడవటం -

"దావూద్ ఇబ్రహీం తెలుసా? బాలీవుడ్ గ్యాంగ్‌లో నీకు ఎవరితో పరిచయం?" అని ఇంకొకడు లాఠీతో మోకాళ్ళపై కొట్టడం -

"బిన్ లాడెన్‌కీ, నీకూ కనెక్షన్స్ వున్నాయా?" అని ఒకడు వంగోపెట్టి గుద్దులు గుద్దడం-

"అబూసలేం ఎవరు? నీకూ, అతనికీ కనెక్షన్ ఏమిటి?" అని మరొకడు వెరైటీగా పడుకోబెట్టి మెడ మీద బూటుకాలితో నొక్కడం -

"ఐ.యస్.ఐ.కీ, నీకూ ఏమిటి లింక్?" అని ఇంకొకడు ఐస్‌ముక్కల ట్రీట్‌మెంట్ ఇవ్వడం -

దాదాపు చలపతి ప్రాణాలు పోయినంత పనై... ప్రతీసారీ కళ్ళల్లో నక్షత్రాలు కనిపించాయి. ఒంట్లో ఎముకలన్నీ సున్నమైపోయాయి.

చలపతిని వాళ్ళు ఏమీ మాట్లాడనివ్వడం లేదు. "నాకు ఏం తెలియదు. నేను టీ.వీ.లో..." అంటూ ప్రతీసారీ అతనేదో చెప్పబోవడం...

"మాట్లాడావంటే పళ్లు పీకేస్తాం!" అని వాళ్ళు బెదిరించడంతో ఇంకేం మాట్లాడలేక పోయాడు.

నేరస్థుల చేత నిజాలు కక్కించడానికి ఇంకా బాగా హింసించడంలో నిపుణులు విజయవాడ నుండి వస్తారని పోలీసులు అనుకుంటుంటే విన్నాడు చలపతి. అంతే... 'ఇక తన పని అయిపోయింది!' అనుకున్నాడు.

'ప్రివెంటివ్ డిటెక్షన్ యాక్ట్' మొదలుకొని 'టాడా, టుడా, కాడా' లాంటి ఎన్నో ప్రమాదకరమైన యాక్టుల క్రింద తీవ్రమైన నేరాలు ఆరోపిస్తూ... బెయిల్ ఇవ్వడానికి వీలులేని కేసులు చలపతి మీద మోపబడ్డాయి.

విదేశాలకు భారతదేశ రహస్యాలను చేరవేస్తున్నాడనీ, ఒకసారి పెట్రోల్ బంక్‌లో ఒక ఫోన్‌తో మాట్లాడి బంక్‌ని పేల్చివేయబోయాడనీ.., దొంగనోట్ల తయారీ, పంపిణీలో హస్తం వుందనీ.., సెల్‌ఫోన్లలో నీలి శృంగారదృశ్యాలు దేశవిదేశాలలో చిత్రీకరించడం, ప్రసారం చేయడం.., శ్రీలంక యల్.టి.టి.ఈ.తో సంబంధాలు, బిన్‌లాడెన్‌తో కూడా సంబంధాలున్నాయేమోనన్న అనుమానం, చాలా శత్రుదేశాలకు ఏజంట్‌గా పనిచేస్తున్నాడనీ, ఐ.యస్.ఐ. ఏజంట్‌గా ప్రయత్నం చేస్తున్నాడనీ... ఇలాగ దొరికిన కేసులన్నీ బనాయించారు అతగాడి మీద!

జైలులో ఉన్న చలపతి పరిస్థితి గురించి చుట్టుప్రక్కలవాళ్ళు చెప్పుకుటూంటే... అతన్ని చూసే ధైర్యంలేక "నేనేం చేయనురా దేముడా..?" అంటూ శోకాలు పెడుతూ, ప్రపంచంలోని దేముళ్ళందరికీ మొక్కుకుంటోంది బామ్మ.

ఇరుగూపొరుగూ ఓదారుస్తున్నారామెను.

ఇంతలో...

ఓ పెద్ద కారు ఆగింది వాళ్ళ ఇంటి ముందు!

ఆ కారు దిగిన ఆయన లోపలకు వస్తూనే- "బామ్మగారూ... నేను గోపాలాన్ని! మీకు వేలు విడిచిన మేనత్త కొడుక్కు మనవడిని! నేను అమెరికాలో ఉంటున్నాను. నన్ను గుర్తుపట్టారా?" అన్నారు. ఆయన సూటూ బూటూలో ఉన్నారు.

'పులిమీద పుట్రలాగా ఈయనెవరురా బాబూ... అసలే నేను ఆపదలో వున్నాను!' అని బామ్మ అనుకుంటూండగా-

"మీకు వెంకటాచలపతి అనే మనవడు ఉండాలి కదా! యం.యస్.సి. కంప్యూటర్స్ చేసి ఖాళీగా ఉన్నాడని విన్నాను. మా అమ్మాయిని మీ మనవడికి ఇవ్వాలని అడగడానికి వచ్చాను. నేను ఆమెరికాలో భారత రాయబార కార్యాలయంలో పెద్దహోదాలో ఉన్నాను..." అంటున్న ఆయన మాటలు పూర్తికాకుండానే-

"ఇంకెక్కడి చెలపతి బాబూ! నిన్న వాడిని..."

ఆమె మాటలు పూర్తికాకుండానే ప్రక్కన ఉన్నవాళ్ళు జరిగిన సంగతంతా చెప్పారు ఆయనకు.

ఆయన వెంటనే తన జేబులోంచి సెల్‌ఫోన్ బయటకి తీసి అమెరికాకు, ఢిల్లీకి, హైదరాబాదుకు ఫోనులు కొట్టాడు.

ఆ వెంటనే "బామ్మగారూ... కంగారుపడకండి! చలపతిని విడుదల చేసేస్తారు!" అంటూ ఆమెను ఓదార్చసాగాడు ఆయన.

కేబుల్ టి.వీ.లో వచ్చే వివిధ చానెల్స్ పెట్టే కార్యక్రమాలలో ఊరించే బహుమతులను గెలుద్దామని ఆశించి ఇదంతా చేశాడనీ, అంతేతప్ప అతనికి ఏ పాపం తెలియదనీ, ఆయన అమెరికా నుండి హైదరాబాదు వరకూ ప్రభుత్వ ఉన్నత అధికారులకు ఫోన్లు చేసి, చేసి సాధించాడు చివరకు!

ఆ సాయంత్రం చలపతిని ఒక పోలీస్ వ్యాన్‌లో తీసుకువచ్చారు.

"వాటె హెల్... యూ పీపుల్! అస్సలు నేరస్తుణ్ణి మాట్లాడనిస్తారా, లేదా మీరు? అతను ఏం చెప్పాడు?" అని ఆయన కోపంతో అంటుంటే... పోలీసులు మౌనంగా వుండిపోయారు.

పోలీసులు వెళ్లిపోయాక, ఆయన చలపతితో-

"చలపతీ! మనం అమెరికాకి వెళ్లిపోతున్నాం... నీ మరదలితో నీకు పెళ్ళి! బామ్మతో తయారైపో త్వరగా... నీకు ఉద్యోగం రెడీగా వుంది! ఇదిగో... నీ వుడ్‌బీ మాట్లాడు!" అంటూ ఆయన చలపతికి సెల్ ఇవ్వబోయాడు.

అంతే... దాన్ని చూస్తూనే- హేండ్ గ్రెనేడ్‌ని చూసినట్లుగా భయంతో చూస్తూ "బాబోయ్‌ః... నాకు సెల్ చూపించకండి!" అని ఒక్క కేక వేసి క్రింద పడిపోయాడు మాంసం ముద్దలాగా.

ఒళ్ళు హూనం అయిపోయింది కదా... పాపం- చలపతికి.

●

'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక ... ఫిబ్రవరి' 2006 సంచికలో ప్రచురితం